క్లుప్తంగా

ఆంజనేయరెడ్డికి తెలుగు కీర్తి పురస్కారం



దత్తాత్రేయ, వేణుగోపాలాచారి నుంచి పురస్కారం అందుకుంటున్న ఆంజనేయరెడ్డి

కాకినాడ రూరల్: కాకినాడకు చెందిన సామాజిక కార్యకర్త అనపాల ఆంజనేయ రెడ్డి తెలుగు కీర్తి పురస్కారం అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలుగు విశ్వ విద్యాలయంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రమణయ్యపేటలోని ఏపీపీఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను చిరు వ్యాపారి అని, ప్లాస్టిక్ సామగ్రి అమ్ముకుంటే వచ్చే లాభంలో అధిక మొత్తం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తానన్నారు. ఏడాది పొడవునా కాకినాడ–పిఠాపురం రోడ్డులో భవాని కాస్టింగ్స్ సమీపంలో చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెళ్లి చేసుకోకుండా సేవా కార్యక్రమాలకే జీవితం అంకితం చేశానని, తనను తెలుగు కీర్తి పురస్కారంతో సత్కరించడం మధురానుభూతిని మిగిల్చిందన్నారు.

నేత్రదానంపై అవగాహన అవసరం



కరపత్రాలను విడుదల చేస్తున్న డాక్టర్ బాలకృష్ణ తదితరులు

బాలాజీచెరువు: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాదం బాలకృష్ణ ఐ–బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐ–బ్యాంక్ ఆవరణలో నేత్రదాన అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐ–బ్యాంక్ స్థాపించి 19 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో సెప్టెంబర్ 8వ తేదీ వరకూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకూ 7,584 కార్నియాలు సేకరించి, అంధులకు ఉపయోగించామన్నారు. అన్ని వయసుల వారు నేత్రదానం చేయవచ్చని, కేవలం కంటిపై పొర మాత్రమే సేకరిస్తారన్నారు. నేత్రదానంపై ఇప్పటికీ అవగాహన లేక అనేక మంది ముందుకు రావడం లేదన్నారు. దీనిపై అవగాహన పెంచుకుని బంధువులు, స్నేహితులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐ–బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్, మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దుర్గాభవానీ బృందం

కాకినాడ క్రైం: కాకినాడ గుడారిగుంటలో ఉన్న ఆదిత్య నర్సింగ్ కాలేజ్ విద్యార్థులకు ఛేంజెస్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ దాసరి దుర్గా భవాని ఎయిడ్స్ నియంత్రణ, నివారణ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భవాని మాట్లాడుతూ, లైంగిక వ్యాధులపై తగిన అవగాహన లేక ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. యువతలో చైతన్యం పెంపొందితే మహమ్మారిని సమూలంగా నాశనం చేయవచ్చన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



గోడౌన్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కరప: మండలంలోని కరప, వేళంగి, గురజనాపల్లి గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాలలో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఎరువులను బ్లాక్ చేసినా, అధిక రేట్లకు విక్రయించినా, లింక్ పెట్టి విక్రయించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఒక దుకాణంలో ఎరువులు, రసాయన మందులు ఒకే గోడౌన్‌లో ఉంచడాన్ని గమనించారు. 15:15:15 రకం 124 బస్తాలు, డీఏపీ 89 బస్తాలు, ఎస్ఎస్‌పీ 6 బస్తాలు అమ్మరాదని రిజిస్టర్‌లో స్టాప్ సేల్స్ రాశారు. ఈ తనిఖీలో ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య, విజిలెన్స్ సీఐ, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

గాలికి వదిలేశారు

- పర్యవేక్షణ కొరవడిన ఓపెన్ జిమ్‌లు
- ఎండకు ఎండి, వానకు తడుస్తున్న పరికరాలు
- కనీస నిర్వహణ లేకపోవడంతో కిర్రు శబ్దాలు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



పీఆర్ కళాశాలలో ఓపెన్ జిమ్

కాకినాడ లీగల్: స్మార్ట్ సిటీల్లో కాకినాడ నగరం ఒకటి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో నగరం అభివృద్ధి జరిగిందా అంటే.. ప్రచారం మినహా, అభివృద్ధి కనిపించడం లేదని నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు. కేవలం రోడ్లు, లైటింగ్, డ్రైనేజీల పనులు చేపట్టి, మిగిలినవి పైపై మెరుగులు దిద్దుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్కులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామని, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా వ్యాయామ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఖాళీ స్థలాలను క్రీడా ప్రాంగణాలుగా మార్చామని, కళాక్షేత్రం పేరుతో ఆడిటోరియం ఏర్పాటు చేశామంటూ ప్రకటనలు ఊదరగొట్టారు కానీ.. క్షేత్ర స్థాయిలో ఇవి కనిపించడం లేదు.

మొరాయిస్తున్న పరికరాలు

స్మార్ట్ సిటీలో భాగంగా కాకినాడలోని పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా కోట్లాది రూపాయలతో పార్కులను అభివృద్ధి చేసి, వాటిలో లక్షలాది రూపాయలు వెచ్చించి మహిళలకు, పురుషులకు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. జిమ్ పరికరాలను కనీస నిర్వహణ చేయకపోవడం వల్ల ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. జిమ్ చేసే పరికరాలు తుప్పు పట్టి పోయాయి. ఈ కారణంగా పరికరాల్లో గ్రీజు, ఆయిల్ వంటివి లేకపోవడంతో కిర్రు కర్రు అంటూ శబ్దాలతో వ్యాయామం చేసేవారు అసహనానికి గురవుతున్నారు. కుళాయి చెరువు పార్కు రాజాట్యాంక్, గాంధీనగర్ పార్కు, జన్మభూమి పార్కు, బాలభవన్, పీఆర్ కళాశాల ప్రాంగణం, బోట్‌క్లబ్ పార్కులతో పాటు, నగరంలోని పలు పార్కులు, ఖాళీ స్థలాల్లో ఓపెన్ జిమ్‌ను నెలకొల్పారు. వాకింగ్ చేసిన వాకర్లు కాసేపు జిమ్ చేద్దామంటే పరికరాలు మొరాయిస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గాంధీనగర్ పార్కులో ఏర్పాటు చేసిన జిమ్

అక్కరకు రాక..

కార్పొరేషన్ స్థాయి నుంచి స్మార్ట్ సిటీ హోదా పొందిన కాకినాడ నగరం.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదన్న విమర్శలు లేకపోలేదు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, ఉన్న వాటికి నిర్వహణ లోపం కారణంగా అక్కరకు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాసేపు సేద తీరుదామంటే కనీసం పార్కులు కూడా అహ్లాదకరంగా లేకపోవడంతో సందర్శకులు పెదవి విరుస్తున్నారు. చెత్తాచెదారంతో పాటు, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

అధికారులు పట్టించుకోవాలి



ప్రస్తుతం కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకపోవడంతో స్మార్ట్ సిటీ అధికారులు అభివృద్ధి, సౌకర్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రజల ఆరోగ్యం కోసం అధికారులు లక్షలాది రూపాయలతో నగరంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వాటికి కనీస పర్యవేక్షణ లేకపోవడంతో జిమ్ పరికరాలు తుప్పు పడుతున్నాయి. వ్యాయామం చేసే సమయంలో పరికరాలు పట్టేయడంతో కాళ్లుచేతులు నొప్పులు వస్తున్నాయి. వీటికి మరమ్మతులు చేయించాలి.

– వాడపల్లి సీతారాం, వాకర్

పర్యవేక్షణతోనే మన్నిక



లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలకు ప్రతి నెలా గ్రీజు, ఆయిల్, ఇతర మరమ్మతులపై అధికారులు దృష్టి సారించాలి. లేకపోతే ప్రజలకు వ్యాయామం, అహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారుతాయి. పార్కులలో పేరుకుపోయిన తుప్పలు, చెత్తను తొలగించి, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. అధికారులు స్పందించి ఓపెన్ జిమ్ పరికరాలు పరిరక్షించే ఏర్పాట్లు చేయాలి.

– జేబీవీ ప్రసాద్, స్థానికుడు

ధర్మ పరిరక్షణకు కృష్ణమాచార్య కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌరినాయుడు

బోట్‌క్లబ్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు సనాతన వైదిక ధర్మ పరిరక్షణకు ఎక్కిరాల కృష్ణమాచార్య ఎంతగానో కృషి చేశారని పద్యకవి కొరుప్రోలు గౌరినాయుడు అన్నారు. స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృష్ణమాచార్యులు రచించిన రుతు గాన కావ్యాన్ని ప్రస్తావిస్తూ, అందులో అంతర్గతంగా ఉన్న సాహితీ సంగీతం విషయాలను వివరించారు. ఆయన రచనలో సంప్రదాయాలు తెలుస్తాయని, తద్వారా సంస్కార ఔన్నత్యాలను అలవడతాయని విశ్లేషించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్కృత ప్రచార సభ అధ్యక్షుడు జీవీకే వర్మ మాట్లాడుతూ, సంస్కృత భాష ప్రాబల్యం పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోటరీ పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ, సంస్కృత ప్రచార సభ కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రచార సభ ప్రతినిధులు కాశీభొట్ల సత్యనారాయణ, గంటి నాగేశ్వరరావు, కిరణ్, డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు .

క్రీడలతో శారీరక వ్యాయామం



వేడుకల్లో క్రీడాకారులను సత్కరిస్తున్న అతిథులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కనీసం రోజులో ఓ గంట క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీరానికి వ్యాయామం అందించవచ్చని ఒలింపిక్ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు ముత్తా నవీన్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి, సాయి రిటైర్డ్ కబడ్డీ కోచ్ వీఎస్‌వీ ప్రసాద్ హాజరయ్యారు. తొలుత ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. సంఘ అధ్యక్షుడు పద్మనాభం మాట్లాడారు. విలు విద్య క్రీడాకారిణి నిత్యశ్రీ, బాక్సింగ్ క్రీడాకారిణి సూర్యదీపిక, పి.కృష్ణను అతిథులు సత్కరించారు.



ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

డీఎస్‌ఏలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాస్ ర్యాలీని ప్రారంభించారు. డీఎస్‌ఏ నుంచి నాగమల్లితోట జంక్షన్ వరకు, తిరిగి డీఎస్‌ఏకు ర్యాలీ చేరింది. శ్రీనివాస్ మాట్లాడుతూ, ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, కార్యదర్శి రవిరాజు, ఇన్‌చార్జి డీఎస్‌డీఓ సతీష్‌కుమార్, కోచ్‌లు సమీర్, సురేష్, అప్పలనాయుడు, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ రాధాకృష్ణ, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు ప్రాధాన్యం తప్పనిసరి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చదువులో భాషకు ప్రాధాన్యం ఉండాలని, ఆధునిక నాగరికత మోజులో పడి చదువును నిర్లక్ష్యం చేయరాదని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. విద్యుత్‌నగర్ ఐడియల్ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ చిరంజీవినీ కుమారి భాషా సాహిత్య ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ఈ ఏడాది నుంచి డిగ్రీలో తెలుగు భాష ప్రాధన్యాన్ని పెంచారని చెప్పారు. ప్రముఖ నవలా రచయిత రవిమంత్రి మాట్లాడుతూ, కొత్త తరం యువతలో తెలుగు భాష ప్రాధాన్యం, సాహిత్య అధ్యయన స్పృహ పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. తెలుగు రచయితలందరూ ఇందుకు ప్రయత్నించాలన్నారు. వివిధ పోటీల్లో 51 పాఠశాలలు, 11 కళాశాలల నుంచి 830 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. రాజీవ్‌గాంధీ కళాశాల ప్రథమ, జగన్నాథపురం సెయింట్ జేవియర్స్ స్కూలు విద్యార్థులు తెలుగు పాటల పోటీలు, క్విజ్‌లో ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించారు. కళాశాల కరస్పాండెంట్ కిరణ్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ,, ఏవో రంజిత్, ఏడీ కేఎస్ వాసు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

కరప: గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.



ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తున్న అతిథులు



గురజనాపల్లి హైస్కూల్‌లో సన్మాన గ్రహీతలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. హెచ్‌ఎం ఎ.సాయి మోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ, రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ సేవలను కొనియాడారు. విద్యార్థులకు తెలుగు పద్య పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు ఎ.సూర్యనారాయణ, కేఎస్‌వీ లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావు, యోగా ఉపాధ్యాయుడు బాబ్జీని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు పి.భవాని, టి.వేణుగోపాల్, వి.శోభాకర్, ఎస్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగును సజీవంగా అందించిన గిడుగు

కాకినాడ రూరల్: భావితరాలకు తెలుగు భాషను సజీవంగా, సులభంగా అందించిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ అన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న పీజీ సెంటర్‌లో మాతృ భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి నిర్వహించారు. రమణయ్యపేటలో మాతృభాషా, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు.



ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులు

నిరక్షరాస్యులను చదువుతో తీర్చిదిద్దాలి

కరప: విద్యా వలంటీర్లు నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం విద్యా వలంటీర్లకు ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యా వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేసి, నూరు శాతం అక్షరాస్యత సాధించాలన్నారు. మండలంలో 190 మంది వలంటీర్లను ఉపాధి పథకం, వెలుగు శాఖల ద్వారా నియమించినట్టు చెప్పారు. వయోజన విద్య ప్రతినిధి పోలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ, విద్యా వలంటీర్లు శిక్షణలో చదువుతో పాటు, మొబైల్ వినియోగం, లెక్కలపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు పులపకూర వెంకటరమణ, వెలుగుబంట్ల శ్రీనివాసరావు విద్యా వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. తొలుత వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఓ బీఎల్ నరసింహం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 15 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వివాదాస్పదంగా యూరియా పంపిణీ

- కావాల్సిన వారికి ఇచ్చుకుంటున్నారని రైతుల మండిపాటు
- ఎంఏఓ ఆదేశాలతో రెండు బస్తాల చొప్పున సరఫరా

కరప: జెడ్.భావారం సొసైటీ వద్ద యూరియా పంపిణీ వివాదాస్పదంగా మారింది. ఆర్ఎస్‌కేకు వచ్చిన యూరియా జెడ్.భావారం సొసైటీ గోదాంలో దింపి, మధ్యాహ్నం ఇస్తామని చైర్మన్ చెప్పడంతో వెళ్లిపోయిన రైతులు.. మధ్యాహ్నం వచ్చేసరికి సగం స్టాక్ చైర్మన్ అనుయాయులకు ఇచ్చేశారని ఆరోపిస్తూ రైతులు మండిపడ్డారు. వచ్చిన రైతులందరికీ రెండు బస్తాల వంతున ఇవ్వాలని ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య ఆదేశించడంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం జెడ్.భావారం ఆర్ఎస్‌కేకు పది టన్నుల యూరియా(225 బస్తాలు) స్టాక్ రాగా, గోదాం లేక జెడ్.భావారం పీఏసీఎస్ గోదాంలో అన్‌లోడ్ చేశారు. అరట్లకట్ట గ్రామానికి చెందిన పలువురు రైతులు యూరియా అడగ్గా, స్టాక్ దిగుతోంది, మధ్యాహ్నం ఇస్తామని చెప్పడంతో వెళ్లిపోయారు. అన్‌లోడ్ చేస్తుండగానే చైర్మన్ ఒకరికి ఆరు బస్తాలు ఇచ్చి పంపించేశారు. అదే సమయంలో అక్కడున్న రైతులు అడగ్గా, పేర్లు రాయించుకోండని, మధ్యాహ్నం ఇస్తామని వెళ్లిపోయారు. రైతులు సొసైటీ వద్దకు వచ్చినప్పటికీ, మధ్యాహ్నం 3.30 వరకూ గోదాం తీయకుండా సిబ్బంది తాత్సారం చేశారు. రైతులు సొసైటీ, వ్యవసాయ అధికారులకు ఫోన్లు చేయగా, పొంతన లేకుండా మాట్లాడుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని, ఎంఏఓ దృష్టికి తీసుకెళ్లగా, అక్కడున్న రైతులందరికీ ఒక్కొక్కరికి రెండు బస్తాల వంతున ఇచ్చి, ఆధార్, ఫోన్ నంబర్లు నోట్ చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ మేరకు రైతులకు యూరియా ఇచ్చి పంపించడంతో వివాదం సద్దుమణిగింది. ఇలాఉండగా రైతులకు బిల్లు రాసి ఇవ్వకుండా, బుక్‌లో నోట్ చేసుకుని బస్తాకు రూ.270 వంతున తీసుకున్నట్టు రైతులు తెలిపారు. యూరియా కొరత ఉందా అని ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ సత్యను విలేకరులు అడగ్గా, రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని, మండలానికి సరిపడా స్టాక్ డీలర్ల వద్ద, ఆర్ఎస్‌కేల వద్ద ఉందన్నారు.



యూరియా కోసం క్యూలో నిలబడిన రైతులు

గణేశ్ మండపాల్లో ఆధ్యాత్మిక శోభ



ప్రత్యేకాలంకరణలో సంపత్ విజయ గణపతి



ఎస్.అచ్యుతాపురం రైల్వే గేటు వద్ద విద్యుద్దీపాలంకరణ

కాకినాడ రూరల్: గణపతి నవరాత్రులు కాకినాడ రూరల్ మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. గణేశ్ మండపాల వద్ద ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. విద్యుద్దీపాలంకరణ నడుమ మండపాల్లో గణపతులకు ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలతో పాటు, భజనలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గణేశ్ మండపాలను రూరల్ సాగర గణపతి ఉత్సవ సమితి నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, నందూరి సత్తిబాబు, పాలిక శివ, సలాది నాయుడు తదితరులు సందర్శించారు. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో నిమజ్జనాలకు సూర్యారావు బీచ్ వద్దకు రావాలని, అక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు మండపాల నిర్వాహకులకు తెలిపారు.

గణపతికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయ శాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామి వారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం, అనంతరం దశ సహస్ర చామంతి పూజ వైభవంగా నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ ఈఓ వి.వెంకట శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు

బోట్‌క్లబ్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పేర్రాజుపేట కరసూది వారి వీధిలో బాలగణేశ్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మహిళలకు కుంకుమ పూజలు నిర్వహించారు. యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పూజల్లో పాల్గొన్న మహిళలకు ఉచితంగా పూజా సామగ్రి అందించారు.



49వ డివిజన్‌లో భక్తి గీతాలు ఆలపిస్తున్న భక్తులు



కరసూదివారి వీధిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

స్వామిత్వ సర్వేపై శిక్షణ

కరప: గ్రామ సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు స్వామిత్వ సర్వేపై అవగాహన కల్పించుకుని గ్రామాల్లో సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన శిక్షణను పరిశీలించారు. సర్వే విధివిధానాలపై సూచనలు చేశారు.

మోగిన సైరన్

బోట్‌క్లబ్: నగరంలోని వాటర్ వర్క్స్ ఆవరణలో రోజుకు మూడు సార్లు మోగే సైరన్ కొన్ని నెలలుగా ఆగిపోయింది. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నగరపాలక సంస్థ కమిషనర్ భావనతో మాట్లాడి సైరన్ మరమ్మతులు చేయించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు సైరన్ మోగింది. దీనిని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ప్రారంభించారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- డీఎల్‌డీఓ వాసుదేవరావు

కరప: ఇళ్ల నుంచి వెలువడే చెత్తను వీధుల్లో వేయకుండా, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌డీఓ పి.వాసుదేవరావు అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. శుక్రవారం ఆయన పాతర్లగడ్డ గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి క్లోరినేషన్ పరిశీలించి. పలు సూచనలిచ్చారు. ప్రజలను కలిసి పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.వరుణ్ ఉన్నారు.



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ